నమస్తే తెలంగాణ
మెదక్
I హైదరాబాద్, శనివారం 6 ఏప్రిల్ 2024 MEDAK

## నేడు సంగారెడ్డిలో బీఆర్ఎస్ రైతుదీక్ష

హాజరుకానున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సంగారెడ్డి, ఏప్రిల్ 5: కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం(నేడు) బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుదీక్ష చేపడతామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ దీక్షకు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని, సంగారెడ్డిలోని నటరాజ్ థియేటర్ వద్ద దీక్షాస్థల్ వద్ద ఉదయం 9.30గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సొసైటీ చైర్మన్లు, రైతుబంధు సమితి అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు తరలివచ్చి దీక్షను విజయవంతం చేయాలని కోరారు.



సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కొత్తపల్లిలో సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

# కాంగ్రెస్‌కు బుద్ధి చెబుదాం

### రైతులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు.. హామీల అమలులో విఫలమైంది

- ఏడుపాయలకు బీఆర్ఎస్ మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులు కాంగ్రెస్ సర్కారు రద్దుచేసింది..
- బీజేపీ ఒక్క మంచి పనిచేసిందా..
- వెంకట్రామిరెడ్డి మంచి మనసున్న వ్యక్తి
- కొత్తపల్లి బీఆర్ఎస్ సమావేశంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

పాపన్నపేట, ఏప్రిల్ 5: రైతులను నమ్మించి మోసంచేసిన కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరికి బోనస్ ఇవ్వని కాంగ్రెస్‌ను నిలదీయాలన్నారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదన్నారు. ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా, విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, మహిళలకు మహాలక్ష్మి ద్వారా రూ.2500 సాయం, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని 420 హామీలు ఇచ్చి మోసం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని, కాంగ్రెస్ సర్కారు మాత్రం రైతులను చిన్నచూపు చూస్తున్నదని విమర్శించారు. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయని, పొలాలు ఎండిపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కరెంట్ కోతలు లేవని అంటున్నాడని, సమావేశంలో నేను మాట్లాడుతుండగా మీముందే కరెంట్ పోయిందని, రాష్ట్రంలో కరెంట్ కోతలకు ఇదే సాక్ష్యం అని హరీశ్‌రావు అన్నారు. మొన్న ఎన్నికల్లో ఆశపడి మోసపోయామని, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, బాండ్ పేపర్ మీద రాసి మాట తప్పిన కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని ప్రజలకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను తీసుకొచ్చి, ఆరు గ్యారెంటీలు ప్రకటించి అసెంబ్లీలో చట్టబద్ధత చేస్తామని మోసం చేశారన్నారు. మొన్న రేగోడ్ మండలంలో రైతులకు బ్యాంకు అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తారని ప్రకటించారని రైతులు బ్యాంకు అధికారులకు చెబితే తమకు సంబంధం లేదంటున్నారని గుర్తు చేశారు.

**నిధులు రద్దుచేసిన కాంగ్రెస్ సర్కారు...**

బీఆర్ఎస్ హయాంలో చెక్‌డ్యామ్‌లు నిర్మించి ఘనపురం ఆనకట్ట నుంచి నీళ్లను విడుదల చేసుకున్నామని గుర్తు చేశారు. ఏడుపాయలకు మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులను రద్దుచేసిన కాంగ్రెస్‌కు పతనం ఖాయమని హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లాకు మెడికల్ కళాశాల, రింగ్ రోడ్డుకు నిధులు, రామాయంపేట రెవెన్యూ డివిజన్, సంగమేశ్వర ప్రాజెక్ట్ ద్వారా ఇక్కడికి నీటి విడుదల కోసం బీఆర్ఎస్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మంచి వ్యక్తి అని, సేవాగుణంతో పాటు ధనం ఉన్న వ్యక్తి అని, రూ.100 కోట్లతో ఆయన ట్రస్టు ఏర్పాటు చేసి అందరికీ ఉపయోగకరమైన పనులు చేస్తారని తెలిపారు. దుబ్బాక ప్రజలు రఘునందన్‌ను బండకేసి కొట్టారన్నారు. బీజేపీ మనకు ఒక్క మంచి పనిచేసిందా అని ప్రశ్నించారు. నల్లధనం తెచ్చి పేదలకు పంచుతామని చెప్పి మోసం చేశారన్నారు.

### ప్రజాసేవ చేసేందుకు పోటీచేస్తున్నా..

**- మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి**



తాను ప్రజాసేవ చేయడానికే మెదక్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపీ స్థానానికి పోటీచేస్తున్నానని వెంకట్రామిరెడ్డి అన్నారు. తనను ఆశీర్వదించి అక్కున చేర్చుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు. మెదక్ జిల్లాలో తాను డ్వామా పీడీగా, జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్ పనిచేశానని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎవరికి దక్కని అవకాశం తనకు దక్కిందన్నారు. చంద్రబాబు, వైఎస్ఆర్, కిరణ్‌కుమార్ రెడ్డి, కేసీఆర్‌ల వద్ద పనిచేసిన అనుభవం ఉందన్నారు. కలెక్టర్‌గా మెదక్ గడ్డ తనకు ఎంతో గుర్తింపును తెచ్చిపెట్టిందన్నారు. ఎంపీగా గెలిస్తే పరిపాలన అనుభవంతో పరిశ్రమలు, విద్యాసంస్థల ఏర్పాటుకు కేంద్ర నిధులు తీసుకు వస్తానన్నారు. పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి ఏడు నియోజకవర్గ కేంద్రాల్లో నిరుద్యోగులకు ఉచిత కోచింగ్, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఫంక్షన్‌హాళ్లు నిర్మించి ఉచితంగా ఇస్తానన్నారు.

### మాటతప్పిన కాంగ్రెస్, బీజేపీని ఓడించాలి..

**– బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**



బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి భయపడేది లేదన్నారు. ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటామన్నారు. కార్యకర్తలను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని భరోసా ఇచ్చారు. కేసీఆర్ మాట మీద నిలబడే వ్యక్తి అని అన్నారు. వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించి ఓటమికి ప్రతీకారం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, నగేశ్, సోములు, విష్ణువర్ధన్‌రెడ్డి, కుమ్మరి జగన్నాథం, గురుమూర్తి గౌడ్, వెంకట్‌రాములు, శ్రీనాథ్, అనురాధ, బాబాగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశానికి హాజరైన కార్యకర్తలు, మహిళలు



# నీరాజనం

ఉద్యమం నాటి రోజులను గుర్తుకు తెచ్చిన ప్రయాణం

### కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు




సిద్దిపేట జిల్లా బెజ్జంకి క్రాసింగ్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులకు, రైతులకు బస్సులో నుంచి అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- రాజీవ్ రహదారి వెంట అడుగడుగునా గులాబీ సైనికుల స్వాగతం
- వందలాది కార్లతో కాన్వాయ్‌గా కరీంనగర్ జిల్లాకు వెళ్లిన గులాబీ అధినేత
- రంగధాంపల్లి స్తూపం వద్ద సిద్దిపేట నేతల స్వాగతం
- బెజ్జంకి క్రాసింగ్ వద్ద వరి కంకులతో రైతులు, పార్టీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే రసమయి నేతృత్వంలో స్వాగతం

సిద్దిపేట, ఏప్రిల్ 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కరీంనగర్ పర్యటనకు బయలుదేరిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రహదారి వెంట బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జై కేసీఆర్.. జైజై కేసీఆర్ నినాదాలు చేస్తూ ఘనస్వాగతం పలికారు. కేసీఆర్ కాన్వాయ్‌లో కార్లలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వాహనాల్లో తరలివెళ్లారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఎండిపోయిన పంటలను పరిశీలించడానికి ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి శుక్రవారం ఉదయం 10 గంటలకు కేసీఆర్ బయలుదేరారు. రాజీవ్ రహదారి వెంట కార్యకర్తలు గులాబీ జెండాలు చేతబట్టి కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ప్రజ్ఞాపూర్, కుకునూరుపల్లి, కొండపాక, సిద్దిపేట రంగధాంపల్లి, శనిగరం స్టేజీల వద్ద ఆయా నియోజకవర్గాల కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు తమ వాహనాలతో కేసీఆర్ కాన్వాయ్‌లో కలిసి ముందుకు సాగారు. మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి క్రాసింగ్ వద్ద మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నేతృత్వంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కేసీఆర్‌కు స్వాగతం పలకడానికి కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాస్ లక్ష్మణ్, కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇతర పార్టీ నేతలు అక్కడి చేరుకున్నారు. బెజ్జంకి క్రాసింగ్ వద్దకు 11.58 గంటలకు కేసీఆర్ చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి నేతృత్వంలో రైతులు, పార్టీ శ్రేణులు వరి కంకులతో కేసీఆర్‌కు స్వాగతం పలికారు. 10 నిమిషాల పాటు కాన్వాయ్ ముందు పార్టీ శ్రేణులు కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని, చేతికొచ్చిన పొలాలు ఎండిపోతున్నాయని రైతులు చెప్పారు. కేసీఆర్ బస్సులో నుంచి పార్టీ శ్రేణులకు, రైతులకు అభివాదం చేశారు. అందిరికీ నమస్కారం చెబుతూ ముందుకు సాగారు. కేసీఆర్ కాన్వాయ్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. పార్టీ క్యాడర్‌కు ఆయన కూడా అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు.

**బస్సులో నుండే అభివాదం**

బస్సులో నుంచే పార్టీ శ్రేణలకు, ప్రజలకు, రైతులకు కేసీఆర్ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ప్రత్యేక బస్సులో కేసీఆర్ ముందు కూర్చున్నారు. పక్కనే కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ కూర్చున్నారు. చాలా గ్రామాల వద్ద పార్టీ శ్రేణులు కాన్వాయ్‌ను ఆపుతుండడంతో పదండి ముందుకు అంటూ కేసీఆర్ సైగలు చేస్తూ ముందుకు కదిలారు. కేసీఆర్ విజయ సంకేతం చూపారు. రెండు చేతులు జోడించి ప్రజలకు అభివాదం చేశారు. దాదాపు రెండు గంటలకు పైగా రాజీవ్ రహదారి గుండా కేసీఆర్ కాన్వాయ్ కొనసాగింది. సిద్దిపేట జిల్లా కేసీఆర్ పర్యటన షెడ్యూల్ లేనప్పటికీ కేసీఆర్‌కు స్వాగతం పలకడానికి పార్టీ శ్రేణులు, రైతులు, అభిమానులు కదిలివచ్చారు.

### ఉద్యమం రోజులు గుర్తుకువచ్చే...

కరీంనగర్ జిల్లా పర్యటనకు కేసీఆర్ భారీ కాన్వాయ్‌తో వెళ్లడంతో తెలంగాణ ఉద్యమ రోజులను మళ్లీ గుర్తుకు తెచ్చింది. నాడు ఉద్యమ సమయంలో కేసీఆర్ ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా ఇదే తరహాలో భారీ కాన్వాయ్‌తో వెళ్లేవారు. మళ్లీ కేసీఆర్ భారీ కాన్వాయ్‌తో వెళ్లడంతో క్యాడర్‌లో ఉత్సాహం కనిపించింది. పదవులు అనుభవించినవారు పార్టీని వీడి వెళ్తున్నా కార్యకర్తలు మాత్రం అవేవీ పట్టించుకోకుండా రెట్టించిన ఉత్సాహంతో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కేసీఆర్ పర్యటనలో కార్యకర్తల ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తున్నది. కిలోమీటర్ల పొడవునా కాన్వాయ్ కదిలింది. రాజీవ్ రహదారికి ఇరువైపులా ఆయా గ్రామాల ప్రజలు, పార్టీ నాయకులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ఈ ఉత్సాహం చూస్తుంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని తెలుస్తున్నది. ఇవాళ ఎక్కడ చూసినా ఎండిన పంట పొలాలు, వచ్చిపోయే కరెంట్, కష్టాల్లో రైతులు కనిపిస్తున్నారని, కేసీఆర్ పాలనలో ఇలాంటి పరిస్థితి లేదని బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు చర్చించుకున్నారు.



కోహెడ మండలం శనిగరం స్టేజీ వద్ద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు తరలివచ్చిన మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ శ్రేణులు



కొమురవెల్లి స్వాగత తోరణం వద్ద పూలతో వేచి ఉన్న బీఆర్ఎస్ నాయకులు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు రంగధాంపల్లికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు



ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసేందుకు తరలివచ్చిన కార్యకర్తలు

### ఎర్రవల్లిలో కార్యకర్తల సందడి

మర్కూక్, ఏప్రిల్ 5: ఎండిన పంట పొలాలను కరీంనగర్ జిల్లాలో పరిశీలించేందుకు శుక్రవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కరీంనగర్ జిల్లా పర్యటనకు బయలుదేరేముందు మర్కూక్ మండలం ఎర్రవల్లిలో తన వ్యవసాయ క్షేత్రం వద్ద సుమారు 100 కార్లలో కార్యకర్తలు సందడి చేశారు. వ్యవసాయ క్షేత్రంలోని భవనం వద్దకు ములుగు, మర్కూక్, జగదేవ్‌పూర్, గజ్వేల్ మండలాలకు చెందిన కార్యకర్తలు తరలివచ్చారు.



బెజ్జంకి క్రాసింగ్ వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు తరలివచ్చిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ శ్రేణులు

# ముస్లింలకు అన్యాయం చేసిన కాంగ్రెస్

- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- గజ్వేల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

గజ్వేల్, ఏప్రిల్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేసిందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. మంత్రివర్గంలో మైనార్టీలకు స్థానం కల్పించలేదని, బడ్జెట్‌లో ముస్లిం సంక్షేమానికి భారీగా నిధులు తగ్గించి వివక్ష చూపించిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ముస్లింలు విద్య, వైద్యం, సంక్షేమంలో పెద్దపీట వేశామన్నారు. ముఖ్యమైన పదవులు వారికి కేటాయించినట్లు గుర్తుచేశారు. శుక్రవారం రాత్రి గజ్వేల్ పట్టణంలోని మదీనా మసీద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో హరీశ్‌రావు పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లు తినిపించారు. విందులో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంక్రటామిరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, మైనార్టీ రాష్ట్ర నాయకులు జుబేర్, జాఫర్‌ఖాన్, విరాసత్ అలీ, మదీనా మసీద్ అధ్యక్షుడు యూసుఫ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

# మాట తప్పిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్

కంది, ఏప్రిల్ 5: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలతో పాటు అనేక హామీలిచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గ్యారెంటీల అమలుతో పాటు రైతులకు రూ.2లక్షల పంట రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రమైన సంగారెడ్డిలో రైతు సత్యాగ్రహ దీక్షను నిర్వహించారు. ఈ దీక్షకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. మాట తప్పిన కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం రైతుల సమస్యలు తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 99041 19119 ఏర్పాటు చేసిందని, ఈ నంబర్ ఉపయోగించుకోవాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా రైతులకు రుణమాఫీ చేయడం లేదని, రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవీందర్, రమేశ్, చంద్రశేఖర్, నాయకులు గురువారెడ్డి, మాణిక్‌రావు, అనంతరావు, జగన్, రవి, వాసు, రైతులు పాల్గొన్నారు.



సంగారెడ్డి రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న లక్ష్మణ్